క్లుప్తంగా

కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవానికి కృషి చేయాలి

దుండిగల్: కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ ఏ-బ్లాక్ ఎస్సీ సెల్ కన్వీనర్‌గా బౌరంపేట ఇందిరమ్మ కాలనీకి చెందిన సాల్మన్ రాజు నియమితులయ్యారు. ఈ మేరకు గండిమైసమ్మలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో హన్మంత్‌రెడ్డి సాల్మన్ రాజుకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం పని చేయాలని సూచించారు. తనపై నమ్మకంతో పదవి అప్పగించిన ప్రతి ఒక్కరికి సాల్మన్‌రాజు కృతజ్ఞతలు తెలిపారు.

పాత పింఛన్ విధానం అమలు చేసే వారికే కార్మికుల మద్దతు

అడ్డగుట్ట: పాత పింఛన్ విధానం అమలు చేసే వారికే రైల్వే కార్మికుల మద్దతు ఉంటుందని మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్. శంకర్ రావు అన్నారు. నూతన పింఛన్ విధానం రద్దు చేసి పాత విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం సికింద్రాబాద్ డివిజన్ కార్యదర్శి రవీందర్ ఆధ్వర్యంలో సంచాలన్ భవన్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ రావు మాట్లాడుతూ.. కార్మికులకు పింఛన్ లేకపోవడంతో పదవీ విరమణ తర్వాత జీవనం అగమ్యగోచరంగా మారుతుందన్నారు. దశలవారీగా చేసిన ప్రజల ఉద్యమాల కు ఫలితంగా కొన్ని రాష్ట్రాల్లో పాత పింఛన్ విధానం అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధం అయ్యాయని, అదే మాదిరి రైల్వే కార్మికులకు పాత పింఛన్ విధానం అమలు చేయాలన్నారు. ధర్నాలో ఉదయ్ భాస్కర్, వరప్రసాద్, ఖాజాబాబా, కృష్ణ, పద్మావతి, చిలుక స్వామి, స్వరూప, యుగంధర్, నర్సింహారెడ్డి, రాజేందర్, అంజయ్య పాల్గొన్నారు.

కలప దుకాణం సీజ్



దుకాణాన్ని సీజ్ చేస్తున్న ఫారెస్టు అధికారులు

జీడిమెట్ల: బిల్లులు లేకుండా కలప కలిగి ఉన్న ఓ కలప దుకాణాన్ని ఫారెస్టు అధికారులు సీజ్ చేశారు. సుభాష్‌నగర్‌లోని ఓ కర్ర దుకాణంలో బుధవారం దూలపల్లి ఫారెస్టు రేంజర్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో సోదా చేశారు. అనంతరం దుకాణంలో రసీదులు లేకుండా కలప ఉండటాన్ని అధికారులు గుర్తించారు. అనంతరం దుకాణాన్ని సీజ్ చేయగా దుకాణ యజమాని తమ వద్ద బిల్లులు ఉన్నాయని తెలిపారు. వాటిని చూపించిన తర్వాతే దుకాణం తెరవడానికి అనుమతులు ఇస్తామని ఫారెస్టు అధికారులు పేర్కొన్నారు. దాడుల్లో సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి, బీట్ ఆఫీసర్ కృష్ణమ్మ ఉన్నారు.

డిప్యూటీ డీఈఎంఓ వేణుగోపాల్ రెడ్డి మృతి తీరనిలోటు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డిప్యూటీ డిస్ట్రిక్ట్ ఎక్స్టెన్షన్ అండ్ మీడియా అధికారి(డీఈఎంఓ) వేణుగోపాల్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తీవ్రంగా కలిచివేసిందని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ ఆవేదన వ్యక్తంచేశారు. వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో ఆయన లేనిలోటు ఎన్నటికీ తీర్చలేనిదని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని తీవ్ర సంతాపాన్ని వ్యక్తంచేశారు. వేణుగోపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం ఈస్ట్ కోస్ట్ రోడ్ నుంచి పాండిచ్చేరి మార్గంలో కారులో వెళ్తుండగా రోడ్డు ప్రమాదం జరిగిందన్నారు. ఆయన మృతి చెందగా భార్య, ఇద్దరు కుమారులు చికిత్స పొందుతున్నారన్నారు. మేడ్చల్ కలెక్టరేట్‌లోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఈఎంఓ వేణుగోపాల్‌రెడ్డి చిత్రపటానికి బుధవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్‌తో పాటు ఇతర సిబ్బంది శ్రద్ధాంజలి ఘటించారు.

భవనంపై నుంచి పడి కార్మికుడి మృతి

నిజాంపేట్: ప్రమాదవశాత్తు ఓ కార్మికుడు నాల్గో అంతస్తు పై నుంచి కింద పడి మృతి చెందిన సంఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సుమన్ కుమార్ కథనం ప్రకారం ఒడిస్సా రాష్ట్రానికి చెందిన రోహిత్ లచ్చిక (24) ఉపాధి నుంచి బాచుపల్లిలోని వాసవీ కన్‌స్ట్రక్షన్‌లో సెంట్రింగ్ పని నిమిత్తం బుధవారం వచ్చాడు. అతడితో పాటు మరో ఏడుగురు మొత్తం 8 మంది కార్మికులు వచ్చారు. నిర్మాణంలో ఉన్న భవనంపై సెల్‌ఫోన్ మాట్లాడుతూ ఉండగా ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

ఆరోగ్యాసనం



ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని బుధవారం కుత్బుల్లాపూర్ జోన్ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అందరూ యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా యోగా గురువులు యోగా ప్రాముఖ్యతను వివరించారు. యోగాసనాలు వేయడం వల్ల కలిగే ఆరోగ్యం ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ప్రతి యోగాసనాలు వేస్తే ఆరోగ్య మెరుగుపుడుతుందన్నారు. ఒక నెల రోజుల పాటు యోగా చేస్తే ఆ మార్పును గమనించవచ్చన్నారు. ఈ ఉరుకుల పరుగుల జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని కోరారు. వేసే ప్రతి యోగాసనం ఆరోగ్యాసనమని అన్నారు. – కుత్బుల్లాపూర్



జీడిమెట్ల సరోజినీ గార్డెన్‌లో యోగాసనాలు వేస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



టీవీఆర్ మోడల్ స్కూల్‌లో యోగాసనాలు వేస్తున్న చైర్మన్ కోటిరెడ్డి, విద్యార్థులు



గాజులరామారం, కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల కార్యాలయంలో యోగా దినోత్సవంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది



నేతాజీ హైస్కూల్‌లో యోగా దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు



రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బాలకృష్ణను సన్మానిస్తున్న బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, భరతసింహారెడ్డి, యోగా గురువులు

జయశంకర్ సార్ ఆశయ సాధన దిశగా పయనించాలి



జయశంకర్ సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ కృష్ణవేణి

దుండిగల్: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా ఉద్యమాన్ని నడిపిన గొప్ప వ్యక్తి ప్రొఫెసర్ కె.జయశంకర్ సార్ అని దుండిగల్ మున్సిపల్ చైర్‌పర్సన్ కృష్ణవేణి అన్నారు. జయశంకర్ వర్ధంతి సందర్భంగా బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ.. జయశంకర్ ఆశయాలను సాధించే దిశగా పయనించాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ సత్యనారాయణ రావు, వైస్ చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్ భరత్ కుమార్, మేనేజర్ సునంద, రెవెన్యూ అధికారి శ్రీహరి రాజు, ఏఈ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్: బౌరంపేట్ గ్రామంలో పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. విద్యార్థిగా.. ఉద్యమ నాయకుడిగా.. ప్రొఫెసర్‌గా.. సీఎం కేసీఆర్‌కు ఆప్తుడిగా తెలంగాణ ఉద్యమాన్ని ఆయన ముందుకు నడిపించిన తీరు అనిర్వచనీయమని కొనియాడారు. తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ... రాష్ట్రం ఎందుకు అవసరమో అవగాహన కల్పిస్తూ.. ఉద్యమాన్ని ఏకతాటిపైకి నడిపించిన ఉద్యమకారుడు జయశంకర్ అని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో బౌరంపేట్ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మురళీయాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతాం

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో సరైన డ్రైనేజీ, నీటి సరఫరా వ్యవస్థ లేకపోవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. బుధవారం ఆయన జీడిమెట్ల డివిజన్ వెన్నెలగడ్డ పర్యటించి స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెన్నెలగడ్డ ప్రాంత వాసులకు ప్రతి వర్షాకాలంలో ఇబ్బందులు తప్పడం లేదన్నారు. అధికార పక్షం ప్రజాప్రతినిధులకు తొమ్మిదేళ్లుగా ప్రజల ఇబ్బందులు పట్టడం లేదని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఏ-బ్లాక్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్, మాజీ కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, హ్యూమన్ రైట్స్ యువజన అధ్యక్షుడు రాధాకృష్ణ, సుదర్శన్‌రెడ్డి, యాదిరెడ్డి, నవీన్‌రెడ్డి, ఓబీసీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ భరత్‌గౌడ్ పాల్గొన్నారు.



అంగడిపేట్‌లో కాంగ్రెస్ పార్టీ కరపత్రాన్ని అందజేస్తున్న భూపతిరెడ్డి

కార్మికుల సంక్షేమానికి బీఆర్‌ఎస్‌కేవీ కృషి



కార్మికుడి కుటుంబానికి నష్టపరిహారాన్ని అందజేస్తున్న బీఆర్‌ఎస్‌కేవీ నేత మదన్‌గౌడ్

కుత్బుల్లాపూర్: కార్మికుల సంక్షేమానికి బీఆర్‌ఎస్‌కేవీ పని చేస్తోందని శ్రమశక్తి అవార్డు గ్రహీత ముద్దాపురం మదన్‌గౌడ్ అన్నారు. జీడిమెట్ల పరిశ్రమకవాడలోని శ్రీ సొల్యూషన్ కంపెనీలో శేషాద్రి అనే కార్మికుడు విధుల్లో ఉండగా ప్రమాదం జరిగి అతని రెండు కాళ్ల డామేజ్ అయ్యాయి. పరిశ్రమ యాజమాన్యం ఎటువంటి ఆర్థిక సహాయం చేయకపోవడంతో బాధిత కుటుంబం మదన్‌గౌడ్‌ను ఆశ్రయించారు. ఆయన యాజమాన్యంతో మాట్లాడి రూ.4.2 లక్షలు ఇచ్చేలా ఒప్పించారు. సదరు మొత్తాన్ని బుధవారం షాపూర్‌నగర్‌లోని తన కార్యాలయంలో కార్మికుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు ఏ కష్టమొచ్చినా తాను అండగా ఉంటానన్నారు. వారి హక్కుల కోసం ఎంతవరకైనా పోరాడతానన్నారు.

అమరుల సంస్మరణ సభలను నిర్వహించండి

- మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లావ్యాప్తంగా గురువారం అమరుల సంస్మరణ సభలను ఘనంగా నిర్వహించాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ తెలిపారు. జిల్లాలోని 61గ్రామాలు, 13 పురపాలక సంఘాల్లో గురువారం ఉదయం 11గంటలకు సంస్మరణ సభలు నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా అమరులకు శ్రద్ధాంజలి ఘటించి, మౌనం పాటించాలని కలెక్టర్ సూచించారు. అమరుల సంస్కరణ తీర్మానం చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్ణీత ఫార్మాట్లో అమరుల సంస్మరణ తీర్మానాలు జాగ్రత్తగా చేయాలని అన్నారు. విద్యాలయాలు, ప్రార్థనా సమావేశంలో రెండు నిమిషాలు మౌనం పాటించి వారి త్యాగాలను గుర్తు చేసుకోవాలన్నారు. మంత్రి చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు.

అన్ని మతాల సంస్కృతులకు గౌరవం

సనత్‌నగర్: అన్ని మతాల ఆచారాలు, సంస్కృతులను రాష్ట్ర ప్రభుత్వం గౌరవిస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం సికింద్రాబాద్‌లోని ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఆలయంలో ఆధ్యాత్మిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో లోక కల్యాణార్థం నిర్వహించిన శాంతియాగం, చండీహోమం, పూర్ణాహుతిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రధానంగా నగరంలో వివిధ భాషలు, వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు నివసిస్తున్నారని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు బోనాలు, గణేష్ నవరాత్రులు, రంజాన్, క్రిస్మస్ తదితర పండుగలను ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎంతో ఘనంగా నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. ఆలయాలు, మసీదులు, చర్చిల అభివృద్ధికి అవసరమైన నిధులను ప్రభుత్వం అందిస్తుందన్నారు.

డా. సుబ్బారావుకు అత్యుత్తమ అవార్డు

లాలాపేట: ఐసీఎంఆర్-జాతీయ పోషకాహార సంస్థ(ఎన్‌ఐఎన్) న్యూట్రీషన్ ఇన్ఫర్మేషన్, కమ్యునికేషన్ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్ విభాగం హెడ్ డాక్టర్ సుబ్బారావు గుజరాత్ సైన్స్ అకాడమీ బుటీ ఫౌండేషన్-జీఎస్‌ఏ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ అవార్డు విజ్ఞాన శాస్త్రాన్ని ప్రాచుర్యంలోకి తీసుకురావడంలో వారు చేసిన కృషికి గాను ఎంపికయ్యారు. సైన్స్ అండ్ టెక్నాలజీని భవిష్యత్‌లో ప్రజలకు అవగాహన కల్పించడం, సైన్స్‌పట్ల ఆసక్తిని రేకెత్తించడం దీని ముఖ్య ఉద్దేశం. గుజరాత్ సైన్స్ అకాడమీ ఆధ్వర్యంలో బుటీ ఫౌండేషన్ ద్వారా ప్లాస్మా ఫిజిక్స్‌లో అంతర్జాతీయ ప్రఖ్యాతి పొందిన ప్రొఫెసర్ బిమ్లా బుటీ పేరుతో ఈ అవార్డును ఏర్పాటు చేశారు. సైన్స్ కమ్యూనికేషన్‌లో ప్రముఖ ఉపన్యాసాలు, ప్రచురణలు, పుస్తకాలు, వ్యాసాలు, వీడియో ప్రదర్శనల రూపంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఈ అవార్డు ప్రదానం చేశారు. డా.సుబ్బారావు ఈ అంశాలపై పరిశోధనలు చేస్తున్నారు. దీనిపై 80 పబ్లికేషన్స్, 10 పుస్తకాలను ప్రచురించారు.

మందుబాబుల హల్‌చల్

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం సందర్భంగా మందుబాబులు రెచ్చిపోయారు.అర్ధరాత్రి వరకు రోడ్లపై సంచరిస్తూ మహిళా భక్తులను భయాందోళనకు గురి చేశారు. సౌండ్‌సిస్టమ్ వద్ద నృత్యాలు చేస్తున్న సమయంలో ఇరు వర్గాలు గొడవ పడి బీరు బాటిళ్లతో ఒకరిపై ఒకరు దాడులకు తెగపడ్డారు. ఈ ఘటనలో ఇద్దరి యువకుల తలలు పగిలిపోయాయి.

పేదలకు డబుల్ ఇళ్లు ఇచ్చే వరకు పోరాడతాం



జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ వద్ద సొంటిరెడ్డి పున్నారెడ్డి, కాంగ్రెస్ కార్యకర్తలు

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి
- నిరాహార దీక్షకు వెళ్లకుండా నేతలను అరెస్టు చేసిన పోలీసులు

జగద్గిరిగుట్ట: తెలంగాణ ప్రభుత్వం కట్టించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు పేదలకు కేటాయించే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. పేదవారికే డబుల్‌బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలిన సొంటిరెడ్డి పున్నారెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి 36గంటల నిరాహారదీక్షకు పూనుకున్నారు. విషయం తెలుసుకున్న జగద్గిరిగుట్ట పోలీసులు నిరాహారదీక్షకు వెళ్లకుండా కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేసి జగద్గిరిగుట్ట స్టేషన్‌కు తరలించారు. పోలీస్‌స్టేషన్ వద్ద పున్నారెడ్డి మీడియాతో మాట్లాడుతూ పలు వాఖ్యలు చేశారు.

డబుల్‌బెడ్‌రూమ్ పేరిట దగా చేశారు..

కేసీఆర్ ప్రభుత్వం ఇళ్లు లేని వారందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తానని 9 ఏళ్లు గడిచిందన్నారు. కానీ ఇంత వరకు ఇళ్లు ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండానే దశాబ్ది ఉత్సవాలు నిర్వహించడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రశ్నించే గొంతులను పోలీసులతో అరెస్టులు చేయించిన ఘనత కేవలం బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వం పేకమేడలా కూలిపోతుందని జోస్యం చెప్పారు. పేదలకు మేలు చేసే ప్రభుత్వం కేవలం కాంగ్రెస్ పార్టీనే అని అన్నారు.

బాలికల చదువుకు సహాయ సహకారాలు అందిస్తాం

జీడిమెట్ల: చదువుకునే విద్యార్థులకు చేసే సహాయం చాలా గొప్పదని హార్ట్ టు హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ మూడె రవినాయక్ అన్నారు. ఈసీఐఎల్‌కు చెందిన ఇద్దరు బాలికలకు తల్లిదండ్రులు లేరని తెలుసుకున్న ట్రస్ట్ సభ్యులు బుధవారం ఎస్‌ఆర్ నాయక్‌నగర్‌లో వారికి నోట్‌బుక్స్, బ్యాగులు, పెన్నులు, యూనిఫామ్స్ ఇతర మెటీరియల్స్‌ను అందజేశారు. ముున్ముందు బాలికల చదువుకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని ట్రస్ట్ సభ్యులు తెలిపారు. వస్తువులు అందజేసిన వారిలో ట్రస్టు సభ్యులు కుల్లాయి నాయక్, జయరాం నాయక్‌లు పాల్గొన్నారు.



బాలికలకు వస్తువులు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

అధునాతన సంతానోత్పత్తి చికిత్సను అందిస్తున్నాం



ద్వితీయ వార్షికోత్సవంలో మాట్లాడుతున్న ఒయాసిస్ ఫెర్టిలిటీ నిర్వాహకురాలు డా. మీరా

కుత్బుల్లాపూర్: సంతానసాఫల్య చికిత్సలో వయస్సు కీలక పాత్ర పోషిస్తుందని.. ఆలస్యం చేయకుండా సంతానసాఫల్య సహాయాన్ని పొందడం చాలా అవసరమని మీరా.జె అన్నారు. కొంపల్లిలోని ఒయాసిస్ ఫెర్టిలిటీలో కన్సల్టెంట్ ఫెర్టిలిటీ సెంటర్ ద్వితీయ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమ ఫెర్టిలిటీ సెంటర్ ద్వారం సంతానం పొందిన జంటలు, పిల్లలకు స్వాగతం పలికారు. అనంతరం డాక్టర్ మీరా మాట్లాడుతూ.. 'ఒయాసిస్ ఫెర్టిలిటీలో, జంటలు తాము తల్లిదండ్రులు కావాలనే కలను నెరవేర్చడానికి అధునాతన సంతానోత్పత్తి చికిత్సలను అందిస్తున్నామన్నారు. 15 శాతం మంది వంధ్యత్వాన్ని ఎదుర్కొంటుండగా కేవలం 3శాతం మంది మాత్రమే సంతానసాఫల్య సహాయాన్ని కోరుతున్నారని తెలిపారు.

ఘనంగా ఆధ్యాత్మిక దినోత్సవం



తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆధ్యాత్మిక ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కుత్బుల్లాపూర్ నియోజవకర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో జరిగిన ప్రత్యేక పూజలు, ప్రార్థనల్లో ఎమ్మెల్యే వివేకానంద్ పాల్గొన్నారు. భారతదేశం మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని మతాలకు సమాన ప్రాధాన్యత ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. – కుత్బుల్లాపూర్





జగద్గిరిగుట్ట శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సుదర్శన హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



సుభాష్‌నగర్ శస్త్రర్ సాహెబ్ గురుద్వారలో సిక్కు మతస్తుల అర్దాస్ (ప్రత్యేక ప్రార్థన)లు



సూరారం రాజీవ్ గాంధీనగర్ బుద్ధ విహార్‌లో..